

గవర్నర్ జిష్ణుదేవ్‌తో కళాశాల యువ వైద్యులు

## యువ డాక్టర్లు ఆదర్శంగా నిలవాలి

● గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**బిట్స్‌పిలానీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణలోని వైద్య విద్య దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ఆర్మీ డెంటల్ సైన్సెస్ కళాశాల 19వ స్నాతకోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ యువ డాక్టర్లు పేదలకు ఉచితంగా సేవలను అందిస్తూ పలువురికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఎండీఎస్ విద్యార్థికి పాట్రన్స్ రోలింగ్ ట్రోఫీ, దక్షిణ్ భారత్ ఏరియాను పిరియాడోంటిక్స్ విభాగం నుంచి డాక్టర్ సురభి భదోరియాకు ప్రదానం చేశారు. ఉత్తమ ఆల్‌రౌండ్ విద్యార్థిగా డాక్టర్ థెరిస్సా గ్రెగొరీ.. చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ రోలింగ్ ట్రోఫీని గవర్నర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన యువ దంతవైద్యులకు అవార్డులు, డిగ్రీలు గవర్నర్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా, జనరల్ ఆఫీసర్ కమాండింగ్, తెలంగాణ ఆంధ్రా సబ్ ఏరియా(టాసా) ఛైర్మన్ డాక్టర్ మమతా కౌశిక్, ఆర్మీదంత వైద్య కళాశాలల ఆధ్యాపకులు, ఆర్మీ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## దార్శనికుడు రాజీవ్ గాంధీ



విగ్రహావిష్కరణలో మంత్రి శ్రీధర్‌బాబు, వీహెచ్ తదితరులు

**ఉప్పల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** కంప్యూటర్ ఆవశ్యకతను దశాబ్దాల క్రితమే గుర్తించిన దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ భారతదేశ దార్శనికుడని రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఉప్పల్ స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేసిన రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని శుక్రవారం సాయంత్రం ఆయన రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ త్వరలోనే అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో నిర్మించబోయే మరో అత్యాధునిక స్టేడియానికి శంకుస్థాపన చేస్తామని చెప్పారు. మాజీ ఎంపి వి.హనుమంతరావు మాట్లాడుతూ అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఉప్పల్ స్టేడియానికి రాజీవ్‌గాంధీ పేరు పెట్టడం మనందరికీ గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఛైర్మన్ శివసేనారెడ్డి, ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, ఏఐసీసీ కో-ఆర్డినేటర్ అంబర్‌పేట్ శ్రీనివాస్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్ పాల్గొన్నారు.

● ప్రొటోకాల్ వివాదం... స్పీకర్‌కు ఫిర్యాదు

తన నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న కార్యక్రమానికి తనను ఆహ్వానించక పోవడాన్ని నిరసిస్తూ స్థానిక ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. హెచ్‌సీఏ రూపొందించిన ఆహ్వాన పత్రికలో తన పేరు లేకపోవడాన్ని ఆయన ఆక్షేపించారు. కాగా, నిర్వాహకులు హడావిడిగా శిలా ఫలకంపై ఎమ్మెల్యే పేరును చేర్చి ఆవిష్కరణకు సిద్ధం చేయడంతో గొడవ సద్దుమణిగింది.

## అంతరంగాలు.. అనంతరంగాలు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మీనారాయణ

**హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** ప్రముఖ కవయిత్రి, జేడీ ఫౌండేషన్ కన్వీనర్ పింగిలి కవితారెడ్డి రచించిన 'అంతరంగాలు.. అనంతరంగాలు' పుస్తకాన్ని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్, జేడీ ఫౌండేషన్ ఛైర్మన్ వీవీ లక్ష్మీనారాయణ శుక్రవారం ఆవిష్కరించారు. బంజారాహిల్స్‌లోని జేడీ ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మన అనుభవాలు భావితరాలకు అందించేందుకు పుస్తక రచన దోహదపడుతుందన్నారు. విద్యార్థులకు మార్కులతో కూడిన విద్య కంటే విలువలతో కూడిన విద్యను నేర్పించాలని, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సామాజిక విశ్లేషకురాలు అనంతలక్ష్మి, ఎంఎల్ఆర్ విద్యాసంస్థల ఛైర్మన్ మర్రి లక్ష్మారెడ్డి, జేడీ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రీషిన్ రాకేష్‌కు జాతీయ అర్థమెటిక్ చాంపియన్‌షిప్



**హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** హైదరాబాద్ నగర విద్యార్థి గ్రీషిన్ రాకేష్ అరుదైన ఘనత సాధించాడు. జాతీయస్థాయిలో నిర్వహించిన అర్థమెటిక్ చాంపియన్‌షిప్‌ను ఆయన సాధించారు. ప్రపంచంలో వేగవంతమైన మానవ కాలిక్యులేటర్‌గా ఘనత వహించిన నీలకంఠ భాను ఆధ్వర్యంలో ఇటీవల జాతీయ అర్థమెటిక్ చాంపియన్‌షిప్‌ను నిర్వహించారు. ఇందులో దేశంలోని 750 నగరాల నుంచి 6వేల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. కాగా, ఫైనల్ రౌండులో ఇచ్చిన సమయంలోగా 150కి పైగా ప్రశ్నలకు సమాధానాలిచ్చిన రాకేష్ చాంపియన్‌గా నిలిచాడు. కాగా, 2020 మెంటల్ కాలిక్యులేషన్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ నీలకంఠ భాను మాట్లాడుతూ.. ఈ చాంపియన్‌షిప్ సాయంతో మేం విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్ల గలిగామని అన్నారు.

## త్వరలో నిమ్స్‌లో 'నాట్' పరీక్ష

**హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** నిమ్స్ బ్లడ్‌బ్యాంక్ సెంటర్‌లో నాట్ (న్యూక్లియిక్ యాసిడ్స్ అంప్లిఫికేషన్ టెక్నాలజీ) ఆధునిక పరీక్ష విధానాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ బీరప్ప నగరి తెలిపారు. బ్లడ్‌బ్యాంక్ సెంటర్ ఆధ్వర్యంలో 'నాట్ ద్వారా మెరుగైన స్క్రీనింగ్, సురక్షిత రక్తాన్ని అందించడం' అంశంపై శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బ్లడ్‌సెంటర్ విభాగం అధిపతి డాక్టర్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ దాతల నుంచి సేకరించిన రక్తాన్ని నాట్ విధానంలో పరీక్షించి 10 నుంచి 15 రోజుల్లోనే ఫలితాలను రాబట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్, ప్రొఫెసర్ శాంతి, వైద్యులు, బ్లడ్‌బ్యాంక్ సెంటర్, నర్సింగ్ సిబ్బంది, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగాలిచ్చి జీవితాల్లో వెలుగులు నింపండి

● తొలగించిన ఆర్టీసీ కార్మికుల విన్నపం



ఆర్టీసీలో తొలగించిన ఉద్యోగులు, కార్మికులు

**హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** గత ప్రభుత్వ హయాంలో చేసిన చిన్నచిన్న పొరపాట్లు, తప్పులకు ఉద్యోగాల నుంచి తొలగించారని, మన్నించి తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకుని మా జీవితాల్లో వెలుగులు నింపాలని టీజీఎస్‌ఆర్టీసీలో తొలగించబడిన ఉద్యోగులు, కార్మికులు ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వానే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చిన్న తప్పుల కారణంగా సుమారు 491 మందిని ఆర్టీసీ నుంచి తొలగించారని, తమ విజ్ఞప్తి మేరకు త్రిసభ్య కమిటీని ప్రభుత్వం నియమించిందని తెలిపారు. అన్ని వివరాలు పరిశీలించి 135మందిని విధుల్లోకి తీసుకున్నారని, మిగతా వారిని కూడా ఉద్యోగాల్లోకి తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాలకు చెందిన సంజయ్, డి.రాంబాబు, రాంచందర్‌యాదవ్, అంజనేయులు, శ్రీనివాసరావు, వాసుతోపాటు తొలగించబడిన ఆర్టీసీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గాంధీనగర్ డివిజన్‌లో అంధకారం

● వీధిలైట్లు వెలగక అవస్థలు

**చిక్కడపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** గాంధీనగర్ డివిజన్‌లోని చిక్కడపల్లి, వివేక్‌నగర్, జవహర్‌నగర్, చిక్కడపల్లి మెయిన్‌రోడ్ తదితర ప్రాంతాల్లో వీధి లైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు పడిన రోడ్లు, పార్కుల చుట్టూ చెట్లు ఉండడంతో చీకటి కారణంగా చాలా ఇబ్బందికరంగా ఉంటుందని వాహనదారులు, పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్యాగరాయగానసభ, సుధాలేన్, సంజీవయ్యనగర్, అరుంధతీనగర్, అన్నానగర్, నేతాజీనగర్, పిట్టల్ బస్తీ, బాపునగర్‌లలోని పలు ప్రాంతాల్లో సైతం వీధిదీపాలు వెలగడంలేదని స్థానికులు వివరిస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

### అడ్డుగా చెట్ల కొమ్మలు..

సిటీసెంట్రల్ లైబ్రరీ లేన్, హనుమాన్ టెంపుల్ లేన్, పీఅండ్‌టీ కాలనీ లేన్, టీఆర్‌టీ గ్రౌండ్ ప్రాంతాల్లో ఆరు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదు. చిక్కడపల్లిలో పలు ప్రాంతాల్లో మినీ హైమాస్ట్ లైట్లు ఉన్నా కూడా చెట్లు కొమ్మలు అడ్డుగా ఉండడంతో ఏమాత్రం వెలుతురు రావడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెలగని లైట్లకు మరమ్మతులు చేసి, అవసరం ఉన్న చోట్ల కొత్తవాటిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



వీధి దీపాలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు

### సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం



అన్ని ప్రాంతాల్లో వీధిలైట్ల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. వారం రోజులుగా 50కి పైగా నూతన వీధి దీపాలు ఏర్పాటు చేయించాము. టైమర్‌లు ఫెయిల్ అయినచోట మళ్లీ పునరుద్ధరించే చర్యలు అధికారులు తీసుకునేవిధంగా వారికి ఆదేశాలు జారీ చేస్తాను. జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి వీధిలైట్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేవిధంగా చర్యలు తీసుకుంటాను. - పావని, గాంధీనగర్ కార్పొరేటర్

## బీసీల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ. 20 వేల కోట్లు కేటాయించాలి

● సీఎం రేవంత్‌రెడ్డికి ఎంపీ ఆర్.కృష్ణయ్య లేఖ

**రాంనగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** బీసీల సంక్షేమానికి కేవలం రూ.11 వేల కోట్లు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించారని, కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం రూ.20 వేలకు పెంచుతూ బడ్జెట్ సవరించాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు రూ.11 వేల కోట్లను కేటాయించారని, ఇది రాష్ట్రంలోని 56 శాతం జనాభా గల బీసీలకు ఏ మూలకు సరిపోదన్నారు. దీనిని రూ.20 వేల కోట్లకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆర్.కృష్ణయ్య సీఎంకు రాసిన లేఖకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మొత్తం రాష్ట బడ్జెట్ రూ.3,04,965 కోట్లు బడ్జెట్‌లో బీసీలకు రూ.11 వేల కోట్లు కేటాయిస్తే ఏ మూలకు సరిపోతుందని ఆయన ప్రశ్నించారు. బడ్జెట్‌లో కొత్త స్కీమ్‌లు ఏమి లేవని, పెరిగిన ధరల ప్రకారం స్కాలర్‌షిప్‌లు, మెస్ చార్జీలు పెంచే ప్రస్తావన లేదన్నారు. కాలేజీ కోర్సులు చదివే విద్యార్థులకు మొత్తం ఫీజులు రియింబర్స్‌మెంట్ చేస్తామని సీఎం ఇచ్చిన హామీకి బడ్జెట్ కేటాయింపు లేదన్నారు. ఈ విద్యా సంవత్సరం కొత్తగా 119 బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు ఇస్తామని ఇచ్చిన హామీకి బడ్జెట్ కేటాయించలేదన్నారు.

రాష్ట్రంలో 320 బీసీ కాలేజీ హాస్టల్స్‌కు, 315 బీసీ గురుకులాలకు ఒకదానికి కూడా సొంత భవనాలు లేవని, స్థలాలు కేటాయించలేదన్నారు. కేటాయించిన ప్రభుత్వ స్థలాలను కూడా ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులకు అధికారులు లంచాలు తిని ధారదత్తం చేస్తున్నారని ఆరోపించారు. బీసీ కార్పొరేషన్‌కు 12 బీసీ కుల ఫెడరేషన్‌కు కేటాయించిన బడ్జెట్ ఏ మూలకు సరిపోదన్నారు. రాష్ట్రంలో 8 లక్షల మంది బీసీ కార్పొరేషన్ ద్వారా దరఖాస్తులు చేసుకుని వేచి చూస్తున్నారని, వీరికి సబ్సిడీ రుణాలు ఇవ్వడానికి సుమారు రూ.6 వేల కోట్లు కావాలని, దీనికి బడ్జెట్‌లో పెంచాలన్నారు. ఎన్నికల వాగ్దానంలో పూర్తి ఫీజులు ఇస్తామని చెప్పి కానీ బడ్జెట్ కేటాయించలేదన్నారు. ఈ బడ్జెట్‌ను సమీక్షించి ఎన్నికల వాగ్దానం ప్రకారం బడ్జెట్ పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు.



ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను కలిసి పూలబొకే అందజేస్తున్న జైస్వాల్‌గార్డెన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీమైసమ్మ దేవాలయం కమిటీ సభ్యులు

## కాలనీల అభివృద్ధికి సహకారం అందిస్తా

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**గోల్నాక, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** గోల్నాక డివిజన్‌లోని జైస్వాల్ గార్డెన్‌కాలనీ అభివృద్ధికి, కాలనీలోని ఆలయ అభివృద్ధికి తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ భరోసా ఇచ్చారు. జైస్వాల్‌గార్డెన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన మాదు సత్యంగౌడ్, కాలనీలోని శ్రీమైసమ్మ దేవాలయం కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన చెరుకు యాదవరెడ్డి, కమిటీల ప్రతినిధులతో శుక్రవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను ఆయన నివాసంలో కలిసి పూలబొకేను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ నెల 23వ తేదీన జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆహ్వానించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాధు సత్యంగౌడ్, చెరుకు యాదవరెడ్డిలను శాలువలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ఏసమస్య ఉన్నా తన దృష్టికి తీసుకవస్తే సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీలోని మైసమ్మ దేవాలయం అభివృద్ధికి కూడా తనపూర్తి సహకారం అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎన్.రమేష్‌గౌడ్, ఎ.రామాగౌడ్, ప్రసన్నాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



కమాన్‌ను ప్రారంభించిన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఎన్ శ్రీనివాస్‌యాదవ్

## ఆధ్యాత్మిక భావనతో మానసిక ప్రశాంతత

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

**చిక్కడపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** ఆధ్యాత్మిక భావనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ ఎస్‌ఆర్‌టీ క్వార్టర్స్‌లోని శ్రీ నల్ల పోచమ్మ, ఉప్పలమ్మ దేవాలయానికి బీఆర్‌ఎస్ నేత బీఎన్ శ్రీనివాస్ యాదవ్ నూతనంగా నిర్మించిన కమాన్‌ను శుక్రవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, డివిజన్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపాల్ మాట్లాడుతూ ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు ముఠా జైసింహ, రాకేష్, పున్న సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, గౌస్‌బాయ్, ముచ్చకుర్తి ప్రభాకర్, నవీన్‌కుమార్, శ్రీకాంత్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**ముషీరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** ముషీరాబాద్ డివిజన్‌లోని ఏక్‌మినార్, ఎంసీహెచ్ కాలనీలో శుక్రవారం రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్, జీహెచ్‌ఎంసీ డీఈ గీతాకుమారిలతో కలిసి ఎమ్మెల్యే ముఠాగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లను అభివృద్ధి పరిచేందుకు కావల్సిన నిధులను సమకూర్చుకుంటూ ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి పరుస్తున్నామన్నారు. రాజకీయాలకతీతంగా నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ పైప్‌లైన్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, అరుణ్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



బదిలీ అయిన డీఎం రఘుకు వీడ్కోలు, కొత్త డీఎంకు స్వాగతం పలుకుతున్న ఆర్టీసీ సిబ్బంది

## కాచిగూడ ఆర్టీసీ డిపోలో కొత్త డీఎంకు స్వాగతం

**బర్కత్‌పుర, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** కాచిగూడ ఆర్టీసీ డిపోలో డీఎంగా పనిచేసిన టి.రఘు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతన డీఎంగా సీహెచ్ వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం ఆర్టీసీ డిపోలో జరిగిన కార్యక్రమంలో మాజీ డీఎం రఘు సిద్ధిపేట ఆర్టీసీ డిపోకు బదిలీ కాగా ఆయనకు వీడ్కోలు పలుకుతూ కొత్తగా వచ్చిన డీఎం వెంకటేశ్వర్లుకు సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొత్త డీఎం మాట్లాడుతూ ఆర్టీసీని బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఆర్టీసీని లాభాల బాటలోకి తీసుకురావాలన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రఘును ఆర్టీసీ సిబ్బంది శాలువా, బొకేతో ఘనంగా సత్కరించారు.

## పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరి చేరవు

● కార్పొరేటర్ యాకర అమృత

**నల్లకుంట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** నల్లకుంట డివిజన్‌ను పరిశుభ్రంగా తీర్చిదిద్దడానికి ప్రజలందరూ సహకరించాలని, పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలు దరిచేరవని కార్పొరేటర్ యాకర అమృత అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని పలు ప్రాంతాలలో ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో ఇంటింటికి వచ్చే చెత్త రిక్షా, ఆటోలలో మాత్రమే చెత్తవేయాలని రోడ్లు, అంతర్గత రోడ్ల మధ్యలో చెత్తను వేయరాదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చెత్తను రోడ్ల కూడలి ప్రాంతాలలో వేయరాదని ఈ విషయంలో జీహెచ్‌ఎంసీ ఇప్పటికే ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించిందని ఆమె గుర్తు చేశారు. జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా రోడ్లపై చెత్త వేసిన వారికి జరిమానా వేయడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాపార్కువద్ద జరిగిన మహాధర్నాలో పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు, భాస్కర్, రమ తదితరులు

## అసంఘటితరంగ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి: సీఐటీయూ

**కవాడిగూడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు కోటి మందికిపైగా అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారని వారికి సామాజిక భద్రత, వెల్ఫేర్‌బోర్డు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్కువద్ద సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మెనిఫెస్టోలోని ప్రకటించిన హామీలను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు పాలడుగు భాస్కర్ తెలంగాణ బీడీ అండ్ సిగార్‌వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమ, తెలంగాణ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ కోటం రాజు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సుబ్బారావు, పక్కన జనార్దనమూర్తి తదితరులు

## భావకవిత్వంలో పలు ప్రయోగాలు చేసిన రాయప్రోలు

**చిక్కడపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** భావకవిత్వంలో రాయప్రోలు సుబ్బారావు పలు ప్రయోగాలు చేశారని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం ఎందరో మహానుభావులు శీర్షికన జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఆధునిక కవిత్వ మార్గదర్శి రాయప్రోలు సుబ్బారావు యాదిలో పేరిట సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కీలకప్రసంగం చేసిన రామరాజు మాట్లాడుతూ భావకవిత్వ యుగకర్త రాయప్రోలు సుబ్బారావు అన్నారు. తమ కుటుంబానికి రాయప్రోలు సుబ్బారావుతో అనుబంధం ఉందని ప్రతి ఏటా ఆయన జయంతి నిర్వహిస్తున్నామని తెలిపారు. రాయప్రోలు రాసిన ఏదేశమేగినా పొగడరా భూమి భారతిని గీతం అందరిలో దేశభక్తిని పెంచిందన్నారు. సభలో గాయని సుందరవల్లి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## కట్టమైసమ్మ దేవాలయంలో పూజలు

**కవాడిగూడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** భాగస్వామ్య పింఛన్ పథకం (సీపీఎస్) రద్దుకావాలని లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ దేవాలయం లో నేషనల్ ఓల్డ్ పెన్షన్ రెస్టోరేషన్ యునైటెట్ ఫ్రంట్ (ఎన్‌ఓపీఆర్‌యూఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు మాచన రఘునందన్ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యునిఫైడ్ పెన్షన్ స్కీమ్ రద్దు కోసం ఈనెల 23న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, విజయవంతంగా కావాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఓపీఆర్‌యూ ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త వెంకటేశ్వర్లు, అర్చకులు గుమ్మడవెల్లి రాజేష్ శర్మ తదితరులు పూజలో పాల్గొన్నారు.

## బాలికను పోలీసులకు అప్పగించిన కార్పొరేటర్

**రాంనగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** బాగ్‌లింగంపల్లి బస్టాప్‌లో మూడు సంవత్సరాల వయసు గల చిన్నారి తప్పిపోయింది. ఈ విషయాన్ని తెలుసుకున్న రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి ఆ చిన్నారిని చిక్కడపల్లి పోలీసులకు అప్పగించారు. ఆ బాలిక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే చిక్కడపల్లి పోలీసులను సంప్రదించాలని రవిచారి కోరారు. ఈ చిన్నారి ఆచూకీ కోసం బాగ్‌లింగంపల్లి పరిసరాలలో విచారించిన ఆ బాలిక తల్లిదండ్రుల వివరాలు తెలియక పోవడంతో ఆయన పోలీసులకు అప్పగించారు.

## మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం



సునీత

**చిక్కడపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** మతిస్థిమితం సరిగ్గాలేని ఓ మహిళ అదృశ్యమైంది. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ బి. రాజునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. అడిక్‌మెట్, నల్లకుంట, ముషీరాబాద్ ప్రాం తాల్లో భిక్షాటన చేస్తూ నాగమయ్య కుంటలో నివసించే సునీత(33) శుక్రవారం సాయంత్రం ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె సోదరుడు శంకర్ ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఒక ప్రభుత్వ పాఠశాలలో మిడ్ డే మీల్స్ తిని ఆహార నాణ్యతను పరిశీలిస్తున్న డాక్టర్ దిడ్డి సుధాకర్, సుధారాణి, జావిద్, షరీఫ్ తదితరులు

## విద్య, వైద్యానికి నిధులు పెంచాలి

● తెలంగాణ ఆమ్ ఆద్మీపార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ సుధాకర్

**కవాడిగూడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** నేటి తెలంగాణలో విద్యా, వైద్యానికి ఎక్కువ నిధులు కేటాయించాలని తెలంగాణ ఆమ్ ఆద్మీపార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాపితంగా ప్రభుత్వ విద్యాలయాలు, దవాఖానాల్లో సర్వే, రాష్ట్ర బడ్జెట్‌లో విద్య వైద్యంపై బడ్జెట్ పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఒక ప్రభుత్వ స్కూల్‌లో మిడ్‌డే మీల్స్ తిని ఆహారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ దిడ్డి సుధాకర్‌తో పాటు పార్టీ మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

## నేటినుంచి రూపాలంకరణ వర్క్‌షాప్

**చిక్కడపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో రూపాలంకరణ వర్క్‌షాప్ ఈ నెల 22, 23 తేదీల్లో సుల్తాన్‌బజార్‌లోని శ్రీ కృష్ణదేవరాయాంధ్రభాషా నిలయంలో జరుగుతుందని సంస్థ అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, వర్క్‌షాప్ సమన్వయకర్తలు నిష్టల సుధామాల, మధుమతి కులకర్ణి తెలిపారు.

## అధిక మాత్రలు మింగి స్వీపర్ మృతి

**బర్కత్‌పుర, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** నడుము నొప్పితో బాధపడుతున్న జీహెచ్‌ఎంసీ స్వీపర్ మోతాదుకు మించి టాబ్లెట్స్ మింగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కాచిగూడ పీఎస్ ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కామ్‌గార్ నగర్‌లో నివాసముంటున్న సురేష్ భార్య కృష్ణవేణి (41) జీహెచ్‌ఎంసీలో స్వీపర్‌గా పనిచేస్తుంది. కొన్ని రోజులుగా నడుము నొప్పితో బాధపడుతుంది. రెండు రోజుల క్రితం నడుమునొప్పి భరించలేక కృష్ణవేణి మోతాదుకు మించి మాత్రలు వేసుకుంది. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం



**కవాడిగూడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):** కవాడిగూడలో ఫుట్‌పాత్‌పై ఓ గుర్తు తెలియని 55 సంవత్సరాల వ్యక్తి మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... గాంధీనగర్ పీఎస్ పరిధిలోని కవాడిగూడ కొత్త బజార్ ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని 55 సంవత్సరాల వ్యక్తి చనిపోయి ఉన్నాడని సమాచారం అందుకున్న గాంధీనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడు అనారోగ్యంతో చనిపోయి ఉంటాడని, యాచకుడిగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆయన ఆచూకీ తెలిసిన వారు గాంధీనగర్ పోలీసులకు గాని లేదా ఫోన్ నంబర్ 8712660140లో సమాచారం అందించాలని కోరారు.

## గుర్తుతెలియని మహిళ...



గాంధీ ఆస్పత్రి ఎదురుగా గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గాంధీనగర్ సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... గాంధీ ఆస్పత్రి ఎదురుగా ఫుట్‌పాత్‌పై ఓ గుర్తుతెలియని మహిళ చనిపోయి ఉందని సమాచారం అందుకున్న గాంధీనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరించారు. మృతురాలు గాంధీ ఆస్పత్రిలో పేషెంట్‌ను చూడటానికి వచ్చిందా లేక యాచకురాల తెలియదని సీఐ పేర్కొన్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు వెంటనేగాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లో గాని లేదా ఫోన్ నంబర్ 8712660140లో సమాచారం అందించాలని ఆయన కోరారు.